క్లుప్తంగా

రేపు ఉరుకుందలో రుద్రహోమం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 19 మంగళవారం రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. హోమంలో పాల్గొనదలచిన వారు ముందుగానే రూ.1500వందలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీ కోరారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

ఆదోని టౌన్: ఆదోని పట్టణ ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(అవోపా), వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ(వామ్), లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారంజాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని దినపత్రికల విలేకరులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆదోని పట్టణ అవోపా, వామ్ అధ్యక్షులు డా.వంకదారు శ్రీనాథ్‌గుప్తా మాట్లాడుతూ ప్రజలకు వారు చేస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియాడారు. జర్నలిస్టుల సేవలను ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు.

కూలిన మరుగుదొడ్డి పైకప్పు



ఆదోని టౌన్: పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీలో మరుగుదొడ్డి పైకప్పు శనివారం రాత్రి కూలింది. పడిపోయిన మరుగుదొడ్డి ప్రాంతాన్ని ఆదివారం కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దాదాపుగా నాలుగు నెలల నుంచి అధికారులకు మరుగుదొడ్డి శిథిలావస్థలో ఉందని చెబుతున్నా పట్టించుకోలేదన్నారు. కౌన్సిల్ సమావేశంలో కూడా మరుగుదొడ్ల గురించి ప్రస్తావించడం జరిగిందన్నారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో మరుగుదొడ్డి టాప్ పడిపోయిందని చెప్పారు. ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడకుండా వెంటనే మరుగుదొడ్డి మరమ్మతు నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులను ఆయన కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు నష్టం



మాట్లాడుతున్న రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపణ్ణ గౌడ్

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం, వ్యాపారుల సిండికేట్‌తోనే వేరుశనగ, పత్తి ధరలు పతనమయ్యాయని రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపణ్ణ గౌడ్ ఆరోపించారు. ఆదివారం స్థానిక రైతు సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేస్తే ధరలు పతనమైతే అప్పుల పాలై రైతులు వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకొనే దుస్థితి దాపురించిందన్నారు. గిట్టుబాటు ధరలపై ప్రభుత్వం చట్టం చేయాలని, అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు చిన్నన్న, మాలిక్, శాంతన్న, కేసీ జబ్బార్, మల్లికార్జున గౌడ్, నరసింహులు, ఖాజ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం బాస్కెట్‌బాల్ ఎరీనా కోర్టులో బాలబాలికల ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదా బాషా మాట్లాడుతూ ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులు వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

14న తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ధర్మపేటలో వచ్చే నెల 14, 15 తేదీల్లో అండర్-14 విభాగంలో సబ్ జూనియర్ క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్వగృహంలో పోటీలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మాస్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సచివాలయాలు నిర్వీర్యం

- అందుబాటులో కొన్ని సేవలు మాత్రమే
- ఇప్పటికే సేవలకు దూరంగా వలంటీర్లు
- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ పథకాల వెబ్‌సైట్లు
- ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డు, పింఛన్ కోసం ఎదురుచూపులు
- ఆధార్ మార్పు, చేర్పులకు ఇబ్బందులు



మండగిరి వార్డు సచివాలయం



పెద్దనేలటూర్ గ్రామ సచివాలయం

ఆదోని సెంట్రల్/గోనెగండ్ల : గ్రామ స్వరాజ్య సాధన కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థ సక్రమంగా సాగేందుకు వీలుగా అవసరమైన ఉద్యోగులను నియమించింది. మీ సేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో అందించే సేవలన్నింటినీ సచివాలయాల పరిధిలోకి తీసుకొచ్చింది. గత ఐదేళ్ల కాలంలో ఏ పని కావాలన్నా ప్రజలు సచివాలయాన్నే ఆశ్రయించేవారు. ఇటీవల అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఆన్‌లైన్ సేవలందించే, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఒక వెబ్‌సైట్ కూడా ఓపెన్ కావడం లేదు. పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వంటి వాటికి దరఖాస్తు చేసుకోవడానికి లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటివద్దకే సేవలు

ఆదోని నియోజకవర్గంలో పట్టణ ప్రాంతంలో 42 గ్రామీణ ప్రాంతంలో 35 సచివాలయాలు ఉన్నాయి. అయా సచివాలయాల్లో 460 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. గోనెగండ్ల మండలంలోని 23 సచివాలయాలు సేవలందిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి, సచివాలయ వ్యవస్థ ద్వారా దాదాపు 545 రకాల సేవలను ప్రజలకు ఇంటి వద్దకే అందించారు. కూటమి ప్రభుత అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడేందుకు సిద్ధమైంది. వారి సేవలను ఉపయోగించుకోవడంలేదు. సచివాలయం ద్వారా అందించే కీలకమైన సేవలను నిలిపివేసింది. మళ్లీ పాత వ్యవస్థలను తెరపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. అధికారంలోకి వచ్చి అయిదు నెలలు కావస్తున్నా సేవలను పునరుద్ధరించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

సాధారణ సేవలు తప్ప కీలక సేవలు లేవు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల్లో సాధారణ సేవలు తప్ప కీలక సేవలు అందడం లేదు. గతంలో ప్రభుత్వ సేవలను పొందేందుకు ప్రజలు మండల కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు కూడా అదే పరిస్థితి దాపురించిందని పలువురు తమ అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో 1బీ, కులం, ఆదాయం వంటి సాధారణ సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు అవసరమైన కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వంటి వెబ్‌సైట్ల్ తెరుచుకోవడం లేదు. దీంతో అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

అపార కష్టాలు

విద్యార్థులకు ఆదార్ తరహాలో శాశ్వత విధానంలో ప్రత్యేక సంఖ్యతో కూడిన గుర్తింపు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. అయితే ఆధార్‌లో, స్కూల్ రికార్డులో వివరాలు తేడా ఉండటంతో అపార్ నమోదు చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని సరిచేసుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులు మీ సేవ, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టు తిరుగుతున్నారు. అదే సచివాలయాల్లో ఆధార్ సేవలు కొనసాగించి ఉంటే సమస్యలు కొంత మేర పరిష్కారం అయ్యేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆధార్ కరెక్షన్ కోసం అవస్థలు



నేను డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నా ఆధా ర్ కార్డులో ఒక డేటాఫ్ బర్త్ ఉంది, టీసీలో మరోలా ఉంది. వాటిని కరెక్షన్ చేసుకోవడానికి మీ సేవ, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా. దీంతో సమయం వృథా అవుతోంది. రోజులు గడుస్తున్నాయి. గతంలో సచివాలయాల్లో ఆధార్ సవరణలు చేసేవారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా సర్‌నేమ్, డేటా అఫ్ బర్త్ వంటివి సచివాలయాల్లోనే కరెక్షన్ చేసే విధంగా చర్యలు చేపడితే బాగుంటుంది.

– నూరి, విద్యార్థి, ఆదోని

ప్రజలకు సేవలందించాలి



సచివాలయాల్లో తక్షణమే వెబ్‌సైట్లు ఓపెన్ చేసి ప్రజలకు సేవలు అందించాలి. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అవుతున్నప్పటికీ ఆరోగ్యశ్రీ కార్డులు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్ష న్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభు త్వం ప్రచారాలు మానుకుని ప్రజల అవసరాలు తీర్చాలి.

– టి. బందెనవాజ్, గోనెగండ్ల

సేవలను పునరుద్ధరించాలి



సచివాలయంలో సాధారణ సేవలు తప్ప కీలకమైన సేవలు అందడం లేదు. దీంతో చాలమంది ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల వంటి వాటి కొరకు ఎదురు చూస్తున్నారు. గతంలో ఏదీ కావాలన్నా సచివాలయానికి వెళ్లి తీసుకునే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అపార్ నమోదు కోసం విద్యార్థులు ఆధార్‌లో ఉన్న తప్పులను సరి చేసుకోవడానికి అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఆలోచించి సేవలను పునరుద్ధరిస్తే బాగుంటుంది.

– శ్రీనివాసులు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

గడ్డివాముల దగ్ధం

నందవరం : మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో చాకలి రాఘప్ప, పెద్ద ఈరన్నకు చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామంలోని రాఘప్ప, పెద్ద ఈరన్న అనే రైతులు పాడి పశువుల కోసం రెండు గడ్డివాములు వేసుకున్నారు. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాములు వద్ద భోజనం చేసి సిగరేట్ వెలిగించుకుని నిప్పు పడేశారు. మంటలు వ్యాపించడంతో స్థానికులు గమినించి రైతులకు సమాచారం ఇవ్వడంతో పాటు అగ్నిమాపక సిబ్బంది సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు, ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. దాదాపుగా రూ.40 వేలు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ఫైర్ సిబ్బంది ఎల్ఎఫ్ సర్దార్, సిబ్బంది వెంకటేష్, లక్ష్మన్న, రమేష్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన మన్మథ అనే వ్యక్తి ఇంటి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి 180 ఎం.ఎల్. పరిమాణం గల 17 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

మండలంలోని విరుపాపురం గ్రామంలో బోయ ఆంజనేయులు అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ రామాంజనేయులు ఆదివారం విలేకరులకు తెలిపారు. అతని వద్ద నుంచి కర్ణాటక మద్యం 90 ఎం.ఎల్. పరిమాణం గల 120 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (టౌన్): స్థానిక కొత్తపేటలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని, ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలని సూచించారు.

పెద్దనేలటూర్‌లో నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు



పెద్దనేలటూర్‌లో ప్రారంభానికి సిద్ధమవుతున్న ఈశ్వరదేవాలయం

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈశ్వరదేవాలయం, గణేష్, సుబ్రహ్మణేశ్వర, శివలింగం, పార్వతి దేవి, బసవేశ్వర, గోపురకలశం, ధ్వజస్తంభం, నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు కల్లుహళ్లి సంస్థాన మఠం పీఠాధిపతి చిన్న వీరశివాచార్య మహాస్వాములు, కోటేకల్లు పరమేశ్వరస్వామి వారిచే నిర్వహించబడుతాయన్నారు. 18న గంగామాత, గోపుర కలశాల ఊరేగింపు, 19న గణేష్ నవగ్రహ కలశ పూజ, అష్ట దిక్కుల కలశ పూజ, శిలా విగ్రహాల జలాధివాసం, ధ్యానదివాసం , హోమం నక్షత్ర కలశ పూజ, 20న యంత్ర ప్రతిష్ఠ, గణేష్, సుబ్రహ్మణేశ్వర, శివలింగం, పార్వతిదేవి, బసవేశ్వర, గోపురకలశం, ధ్వజస్తంభం, నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రేపు రాష్ట్రస్థాయి భజన పోటీలు

ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా మంగళవారం రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు మంగళవారం సాయంత్రం లోపు రూ.500 ప్రవేశ రుసుము చెల్లించి పేరును నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు వరుసగా రూ.16,016, రూ.15,016, రూ.12,016, రూ.10,016, రూ.8,016, రూ.6,016, రూ.4,016, రూ.2,016, రూ.1,016 అందజేస్తామన్నారు. అలాగే ఉత్తమ హార్మోనిస్టు, తబలిస్టు, ఉత్తమ గాయకునికి ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9160000766, 9160923620 నంబర్లను సంప్రదించాలన్నారు.

నూతన ముఖ ద్వారానికి పూజలు



ఆలయ ముఖ ద్వారానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న పెద్ద లక్ష్మమ్మవ్వ ఆలయ ముఖద్వారానికి ఆలయ అర్చకులు విశ్వ బ్రాహ్మణ నరసింహాచారి, కేశవాచారి, ఈరన్నాచారి, పురోహితులు శేషగిరిజ్యోషి, జంగం పంపాపతి స్వామి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే జలాభిషేకం, గంధాభిషేకం, పంచామృతాభిషేకాలు గావించి నూతన వస్త్రములతో ముఖ ద్వారాన్ని అలంకరించి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామలింగారెడ్డి, కరణం కృష్ణమూర్తి స్వామి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగాల సాధనలో వాల్మీకులు ముందుండాలి





పట్టణంలో వాల్మీకి విగ్రహనికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు ,తులసి మొక్కకు పూజలు చేస్తున్న మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: వాల్మీకులు తమ పిల్లలకు విద్యాబుద్దులు నేర్పడంలోను, ఉద్యోగాల సాధనలో ముందుండేందుకు కృషి చేయాలని వాల్మీకి సంఘ నాయకులు బంగారు వెంకటేష్, రాఘవన్, కొండయ్య, మల్లయ్య, కృష్ణమూర్తి, హుసేని, రామకృష్ణ, నారాయణ, లచ్చన్న, రంగన్న సూచించారు. ఆదివారం పట్టణంలోని గ్లోబల్ ఇండస్ పాఠశాలలో వాల్మీకి వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు మునుపు పట్టణంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళలు పాఠశాలలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించి తులసి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళలకు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మునిస్వామి, తిమ్మారెడ్డి, నామాల శ్రీనివాసులు, లక్ష్మన్న, ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

దళిత కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి



అధ్వానంగా మారిన రహదారిని చూపుతున్న దళిత కాలనీవాసులు

ఆదోని రూరల్: దళిత కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని దళిత కాలనీవాసులు శేఖన్న, వీరేష్, ఈరన్న, గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వారు బురదమయంగా మారిన రహదారిని చూపుతూ మాట్లాడారు. మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో చిన్నపాటి వర్షాలకు రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక వీధుల్లో తిరగడానికి చిత్తడిచిత్తడిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత కాలనీలో అధికారులు ఎన్నోసార్లు తిరిగినా కూడా పట్టించుకునేనాథుడే లేడన్నారు. దళితుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వీడి ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి దళిత కాలనీల్లో డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

కులమతాలకు అతీతంగా కార్తీక వనభోజనం



ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు



నృత్యం చేస్తున్న దంపతులు



బహుమతులు అందుకున్న చిన్నారులు

ఆదోని సెంట్రల్: పట్టణంలో కులమతాలకు అతీతంగా చేపట్టిన కార్తీకవన భోజన కార్యక్రమం ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఆదివారం శంకరమఠం సమీపంలోని భారతి తీర్థ ఉద్యానవనం ట్రస్ట్ సభ్యులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడ్, హనుమంతరెడ్డి, శివరామిరెడ్డి, డా.గోవిందరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భారతి తీర్థ ఉద్యానవనంలో ఉదయం 9 గంటలకు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. 10 గంటల నుంచి గరుడాద్రి శర్మ గారిచే ప్రవచనాలను వినిపించారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం పిల్లపాపలతో కలసి పిల్లలు పెద్దలు అందరూ వనభోజనం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు గోపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకు రావాలి



మాట్లాడుతున్న కౌన్సిలర్ దయాసాగర్

ఎమ్మిగనూరుటౌన్: అవయవ దానానిని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని స్థానిక 21 వార్డు మున్సిపల్ కౌన్సిలర్ దయాసాగర్ కోరారు. హైదరాబాద్‌కు చెంది మోహన్ ఫౌండేషన్‌కు ఆదివారం ఆయన అవయవ దానం చేసేందుకు ధ్రువీకరణ పత్రాలను ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తి చనిపోయిన తరువాత అవయవాలు ఎందుకు పనికి రావని, అవయవ దానం వలన చనిపోయిన తరువాత కూడా శరీరంలోని అవయవాలు మరొకరి ఉపయోగపడేందుకు పనికివస్తాయన్నారు. అవయవదానం చేయాలనుకున్నవారు వివరాలకు సెల్ నెంబర్ 7981049949, 9490520288లకు సంప్రదించాలని కోరారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూలమూర్తులు

హొళగుంద: దేవరగట్టులో కార్తీక మాసం మూడవ వారంలో భాగంగా ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, కుంకుమార్చన, భండారార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి, ఆకుపూజ, నివేదన, నిరాజనం తదితర పూజలు చేపటి నైవేద్యం సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

26న రైతు కార్మిక సంఘాల మహాప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న చర్యలను ఖండిస్తూ నవంబర్ 26వ తేదీన మహాప్రదర్శన, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని రైతు రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వేర్‌హస్ హమాలీ యూనియన్ బాడీ సమావేశం కార్మిక, కర్షక భవన్‌లో జరిగింది. హక్కుల కోసం పోరాటాల్లో భాగంగా నవంబర్ 26న అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, నరసింహులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీపీ ఈరన్నకు గాయాలు



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎంపీపీ ఈరన్నను పరామర్శిస్తున్న వై. ప్రదీప్ రెడ్డి

కోసిగి: కోసిగి మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీపీ పి. ఈరన్న, ఆయన భార్య మాజీ వైస్ ఎంపీపీ నాగరత్నమ్మలు పొలం పనులకు వెళ్లి శనివారం సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా బైక్‌పై నుంచి అదుపు తప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. వారు ఆదోనిలోని కృష్ణ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఫోన్ చేసి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తరుపున వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి ఆదోనిలోని ఆసుపత్రికి వెళ్లి ఎంపీపీ ఈరన్న, ఆయన భార్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. వారి వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎమ్మెల్యే పీఏ వెంకట్రామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మంగమ్మ, బండ్ల గోవిందు, తాయన్న, రమేష్ ఉన్నారు.

వాహనాల తనిఖీ

మంత్రాలయం: మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రసర్కిల్‌లో ఆదివారం రాత్రి ఎస్ఐ పరమేష్‌నాయక్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక, తెలంగాణ వైపు నుంచి వచ్చిన వాహనాలను క్షుణంగా పరిశీలించారు. మంత్రాలయం పుణ్యక్షేత్రం కావడంతో ఎవరూ కుడా మద్యం అమ్మకాలు గానీ, రవాణా గానీ చేయకూడదని హెచ్చరించారు. ఎక్కడైనా మద్యం అమ్మకాలు జరుగుతుంటే వెంటనే తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. వసతి గృహాల్లో అసాంఘిక కార్యాకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



గద్వాల సోమన్న రచించిన చిరు మువ్వలు పుస్తకాన్ని పరిచయం చేస్తున్న దృశ్యం



ఎమ్మిగనూరులో రచయితలను సత్కరిస్తున్న దృశ్యం



ఆదోనిలో మాట్లాడుతున్న వక్త

ఆదోని అర్బన్: పట్టణంలోని గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం నాలుగోరోజు కొనసాగాయి. గ్రంథాలయ అధికారిణి సుజాత ఆధ్వర్యంలో కవి సమ్మేళనం చేపట్టారు. నవోదయ అండ్ సైనిక గురుకుల డైరెక్టర్ మరియు ఫ్యాకల్టీ హరికృష్ణ, తెలుగు పండిట్ మల్లికార్జున రికార్డ్ అసిస్టెంట్ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం అవసరం

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు నిరంతరం పుస్తక పఠనం అనేది అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి హరికృష్ణ, రచయిత ఉపాధ్యాయుడు నాగేశ్వరావు అన్నారు.గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో కవి సమ్మేళనం, సెమినార్లపై రచయితల సందేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రచయితలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.బసవరాజు, రత్తయ్య శెట్టి, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

కవి గద్వాల సోమన్నకు సన్మానం

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్నను గ్రంథాలయ వారాత్సవాలు, కవి సమ్మేళంలో భాగంగా ఎమ్మిగనూరు గ్రంథాలయంలో కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ ఉపకులపతి డాక్టర్ యస్‌టీకే.నాయక్, తెలుగు భాష వికాస ఉద్యమం అధ్యక్షుడు జేయస్‌ఆర్ కే.శర్మ, కార్యదర్శి కే.ప్రకాష్, గ్రంథాలయ అధికారిణి వి.పెద్దక్క ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన రచించిన చిరు మువ్వలు పుస్తకాన్ని కవులు, పాఠకులు, పాత్రికేయ మిత్రుల సమక్షంలో పరిచయం చేశారు. కార్యక్రమంలో కవులు సుబ్బలక్ష్మమ్మ, ఇనాయతుల్లా, ఆవుల బసప్ప, స్వరూప సిన్హా, జహీర్ పాల్గొన్నారు.